వీసీని కలిసిన హార్టికల్చర్ టీచర్స్ అసోసియేషన్


వీసీతో రాష్ట్ర ఉద్యానవన టీచింగ్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

ఏజీవర్సిటీ: శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ దండ రాజిరెడ్డిని తెలంగాణ హార్టికల్చర్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పనిచేసి సమస్యల పరిష్కారానికి పరిశోధనలు చేయాలన్నారు. ఉద్యాన పంట సాగు చేసే క్షేత్రల్లోకి వెళ్లి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో హర్టికల్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీనా నాయక్, సురేశ్‌కుమార్, డాక్టర్ సైదయ్య, శ్రీనివాస్, సుచిత్ర, నిఖిల్, ప్రీతంగౌడ్, అశ్విన్, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం..


నాన్ టీచింగ్ కమిటీ సభ్యులు..

నూతన వీసీ డాక్టర్ రాజారెడ్డిని విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ సంఘం సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాన్ టీచింగ్ సంఘం అధ్యక్షుడు పోతురాజు యాదయ్య, ప్రధాన కార్యదర్శి చెంచు రామయ్య, పీ కుమార్, రజినీకాంత్, శ్రావణ్, జీకే ముకేశ్, యుగంధర్, వెంకటేశ్, బెంజమెన్, శ్రీకాంత్, రాజేశ్వరి, దుర్గా, అపర్ణ, అమిర్, రామరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నానక్‌రాంగూడకు నయా లుక్..!

నాడు మురికికూపం చోటే నేడు మినీ పార్కులు

- ఓఆర్ఆర్ నానక్‌రాంగూడ అండర్‌బ్రిడ్జి వద్ద నిర్మాణాలు
- మరింత అభివృద్ధి చేస్తే స్థానికులకు ఎంతో మేలు


నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ అండర్‌బ్రిడ్జి వద్ద పార్కు


ఖాజాగూడ వైపు ప్రారంభ దశలో పార్కు..

రాయదుర్గం: ఒకప్పుడు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, వ్యర్థాల డంపింగ్‌తో మురికి కూపంగా మారిన చోటే మినీ పార్కులు ఏర్పాటు చేయగా కొత్తందాలు సంతరించుకున్నాయి. నానక్‌రాంగూడలోని ఔటర్‌రింగురోడ్డు అండర్ బ్రిడ్జి వద్ద మూడు మినీ పార్కులను హైదరాబాద్ గ్రోత్ కారిడార్ పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఇందులో వాకింగ్ చేసేందుకు ట్రాక్‌లు, గ్రీనరీ కోసం పూల మొక్కలు, ఇతర ఆకట్టుకునే మొక్కలు నాటారు. చుట్టూ ప్రహరీలు, గేట్లు కూడా ఏర్పాటు చేశారు. చాలామంది ఉదయం, సాయంత్రం సేద తీరేందుకు వస్తున్నారు. అయినప్పటికీ వీటి అభివృద్ధిపై మరింత శ్రద్ధ వహించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానికుల డిమాండ్లు..

- ఈ పార్కుల ముందున్న రోడ్డుపై వాహనాల వేగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. చిన్నారులు, వృద్ధులు, మహిళలు పార్కులోపలికి వెళ్లేముందు, బయటకు వచ్చే సమయంలో రోడ్డుదాటే సమయంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.
- నానక్‌రాంగూడ పరిసరాల్లో ఎక్కడా పార్కులు లేకపోవడం, అభివృద్ధి చేసేందుకు అవసరమైన స్థలం కూడా లేకపోయిన తరుణంలో అండర్ బ్రిడ్జి వద్ద మూడు మినీ పార్కులు ఏర్పాటు చేయడం ఆనందంగా స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- అయితే ఈ మినీ పార్కులను మరింత అభివృద్ధి చేయడంపై అధికారులు సరైనా శ్రద్ధ చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరిన్ని వసతులు కల్పించాలని కోరుతున్నారు.
- మూడు మినీ పార్కుల్లో రెండింటిలో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేసినా ఒకదాంట్లోనే అనువుగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.
- రెండు మినీ పార్కుల్లో ఓపెన్ నాలాలు ఉండడంతో కొంత ఇబ్బందిగా ఉందని వాటి స్థానంలో పైప్‌లైన్లు ఏర్పాటు చేసి దుర్వాసన రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.
- ఈ పార్కుల్లో చెట్ల నుంచి రాలిన ఆకులను ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలి.
- అక్కడక్కడా కూర్చునేందుకు బెంచీలు సైతం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చిల్డ్రన్ పార్కుగా అభివృద్ధి చేయాలి..

- మూడు మినీ పార్కుల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించిన తర్వాత అందులో ఒకదానిని పూర్తిగా చిన్నారులు ఆడుకునేలా ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.
- ముఖ్యంగా ఒకేచోట కాకుండా పార్కులను నలుమూలలా ఏర్పాటు చేసి అంతటా చిన్నారులు ఆడుకునేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.


నానక్‌రాంగూడ వైపు ఓఆర్ఆర్ అండర్‌బ్రిడ్జి పార్కులో ఓపెన్ నాలా ..


ఖాజాగూడ వైపు ఉన్న ఓఆర్ఆర్ అండర్‌బ్రిడ్జి వద్ద మినీ పార్కులో పరుచుకున్న పచ్చదనం


ఖాజాగూడ ఓఆర్ఆర్ అండర్‌బ్రిడ్జి వద్ద మినీ పార్కులో వాకింగ్ ట్రాక్..

వార్డుల సమగ్ర అభివృద్ధికి కృషి


ఫ్రెండ్స్ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు పుప్పాలగూడ శివనగర్ కాలనీలో రూ. 42 లక్షల నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం 5వ వార్డు ఫ్రెండ్స్ కాలనీలో రూ. 50లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులు కూడా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు డీ పురుషోత్తం, టీ మీన ముత్యాలు, కే లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్ కుమార్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వీ ఆంజనేయులు, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కే యాదయ్య, ఫ్రెండ్స్ కాలనీ అధ్యక్షుడు అబిద్, ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.


శివనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన చైర్మన్

‘తాపీ మేస్త్రీ హత్య కేసుపై సమగ్ర విచారణ జరపాలి’


సమావేశంలో మాట్లాడుతున్న నిందితుడి తల్లి జయశ్రీ

రాజేంద్రనగర్: తాపీమేస్త్రీ హత్య కేసుపై సమగ్రంగా విచారించాలని నిందితుడి తల్లి జయశ్రీ కోరారు. ఈ కేసులో ఐదుగురి పాత్ర ఉన్నప్పటికీ తన కుమారుడిని బెదిరించడంతో పాటు డబ్బు ఆశ చూపి ఒక్కడినే బలి చేశారని ఆరోపించారు. రాజేంద్రనగర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ కేసులో మొదట తన కుమారుడు ఉన్నట్లు భావించానని, అయితే తాజాగా స్థానికుల ద్వారా నేరం చేసింది తన కుమారుడు కాదని గ్రహించి ములాఖత్‌లో జైల్‌లో కుమారుడిని కలిసి జరిగిన మోసాన్ని తెలుసుకొని న్యాయం చేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్‌ను కలిసి వేడుకున్నట్లు తెలిపారు. తన భర్త చనిపోవడంతో కుమారుడు సాయి వర్షిత్‌తో కలిసి కిస్మత్‌పూర్ వీకర్‌సెక్షన్ కాలనీలో నివాసం ఉంటున్నామన్నారు. గత జూలై 31న అర్ధరాత్రి జరిగిన తాపీమేస్త్రీ రేణుబాబు హత్య కేసులో విచారణలో భాగంగా తన కుమారుడిని ఆగస్టు 1న ఉదయం రాజేంద్రనగర్ పోలీసులు తీసుకెళ్లారన్నారు. అయితే కాళీమందిర్ ప్రాంతంలో నివాసముండే కృష్ణ తన కుమారుడి పూర్వపు క్లాస్‌మేంట్ కాగా.. అతని స్నేహితులు విశాల్, మహేందర్, సోనూ, సందీప్‌లలో హత్యకు గురైె తాపీమేస్త్రీ రేణుబాబు భార్యతో ఉన్న అక్రమ సంబంధం కారణంగా పథకం ప్రకారం రేణుబాబును హత్య చేసి ఉంటారని ఆమె ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌కు తనతో పాటు పోలీసులు తీసుకువచ్చిన కృష్ణ, అతని స్నేహితులు మాయమాటలతో తనకు రూ.50 లక్షలు ఇస్తామని వెంటనే బయటకు తీసుకొస్తామని చెప్పారని.. పోలీసులు హత్య చేసినట్లు ఒప్పుకోవాలని బెదిరించారని తన కుమారుడు చెప్పినట్లు జయశ్రీ తెలిపారు. ఇప్పటికైనా కేసు సమగ్ర విచారణ చేపట్టి నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ విషయమై రాజేంద్రనగర్ డీసీపీ, రాజేంద్రనగర్ ఏసీపీ ప్రత్యేక చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

వీధి వ్యాపారుల మార్కెట్ తనిఖీ



కాళీమందిర్‌లోని వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

సాక్షి ఎఫెక్ట్..

బండ్లగూడ: కాళీమందిర్ ప్రాంతంలోని వీధి వ్యాపారుల మార్కెట్‌ను బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర మంగళవారం తనిఖీ చేశారు. మార్కెట్‌లో ‘రెచ్చిపోతున్న అసాంఘిక శక్తులు’ అనే శీర్షికన ‘సాక్షి’ దినపత్రిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఎవరికి కేటాయించిన విక్రయ కేంద్రంలో వారే వ్యాపారం నిర్వహించుకోవాలని సూచించారు. ఒకవేళ ఇతరులకు కిరాయికి ఇస్తే వారికి కేటాయించిన సముదాయం రద్దు చేస్తామని వీధి వ్యాపారులను హెచ్చరించారు. అలాగే సముదాయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, టీఎంసీ, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

వన్‌టైం సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోండి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జలమండలి అధికారులు

రాజేంద్రనగర్: వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ జలమండలి డివిజన్ జీఎం సాయిలక్ష్మి సూచించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గోల్డెన్ హిట్స్‌లో డీజీఎం ఖాజా జోహర్, మేనేజర్ శ్రావ్య రెడ్డితో కలిసి జలమండలి నీటి బిల్లుల్లో ప్రవేశపెట్టిన వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకంపై వినియోగదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఓటీఎస్ కింద బిల్లులు చెల్లిస్తే పెనాల్టీలు, వడ్డీ మాఫీ అవుతందన్నారు. బిల్లులు చెల్లించి బోర్డు ఆర్థికాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

మణికొండ: వాటర్ పెండింగ్ బిల్లులను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తే వడ్డీ, ఆలస్య రుసుంను తొలగిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జలమండలి మణికొండ డివిజన్ జీఎం మహేందర్‌నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీలుగా ఏర్పడినప్పటి నుంచి చాలామంది బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. ఈనెల 31 లోగా నీటి బిల్లులు చెల్లించి బకాయిలను క్లియర్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకు ఓ అఫిడవిట్‌ను కూడా ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అన్నిదానాల్లో రక్తదానం ఎంతో గొప్పది

గోల్కొండ: అన్నిదానాల్లో రక్తదానం ఎంతో గొప్పదని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి మంగళవారం ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రక్తదానంపై సమాజంలో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తాము నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో అన్ని వర్గాల ప్రజలు తమ సహాయ సహకారాలు అందించారని, దీన్ని వల్లే రక్తదాన శిబిరం విజయవంతం అయ్యిందన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ తదితరులున్నారు.

ఘనంగా కొమురం భీమ్ జయంతి వేడుకలు


కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు, నాయకులు

రాజేంద్రనగర్: భవానీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో కొమురం భీమ్ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వేము సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ భవానీ కాలనీ రజతోత్సవ వేడుకల సందర్భంగా సంస్థ డీఎస్సీ ఎస్. శంకర్‌కు జీవన సాఫల్య పురస్కారం అందించి సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వేము వందనం, రచయిత, నటుడు, దర్శకులు వై.ఎస్.యాదవ్, చంద్రకాంత్ రావు, ఎస్.ఎం.భాష, ఎం.జయరాం, సుగుణ్ చంద్, పరమేశ్వర రావు, టీ అశోక్ కుమార్, పురందేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ బాధితులకు అండగా బీజేపీ


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: మూసీ బాధితులకు అండగా ఉంటూ వారి పక్షాన బీజేపీ పోరాడుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్, బైరాగిగూడ, గంధంగూడ తదితర ప్రాంతాల్లో మూసీ బాధితులతో సమావేశమయ్యారు. ఇందులో విష్ణుశ్వర కాలనీ, శివపురి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, కిస్మత్‌పూర్ ప్రాంతాలకు చెందిన వాసులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు అండగా నిలిచేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ బుధవారం పర్యటిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కొమురయ్య, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్‌యాదవ్, బుక్క వేణుగోపాల్, బండ్లగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు మహేశ్‌యాదవ్, మహాలింగం, కడెం శేకర్‌ముదిరాజ్, నవీన్‌రెడ్డి, పవన్, సుధాకర్, భీమార్జున్‌రెడ్డి, వేణురెడ్డి, ప్రశాంత్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..


సమ్మేళనంలో పాల్గొన్న 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వోన్నత పాఠశాల 1997–98 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని కోకాపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి విద్యాబుద్ధులు చెప్పిన ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంధ్యారాణి, శ్యామల, రేవతి, నీలిమాను ఘనంగా సత్కరించారు. ఇకనుంచి యేటా కలుసుకోవాలని, ఆపద సమయంలో ఒకరికొకరు తోడుగా ఉండాలని నిర్ణయించుకున్నారు.

ఇస్నాపూర్ వరకు మెట్రో నిర్మాణం చేపట్టాలి


మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు నిర్మాణం చేపట్టాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కోరారు. ఈమేరకు అసెంబ్లీ ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును మంగళవారం కలిసి వినతి పత్రంతో పాటు నాగ్‌పూర్ మెట్రో రైలు నమూనాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు మెట్రో రైలు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందన్నారు. మియాపూర్, ఆల్విన్ చౌరస్తా మీదుగా రోజుకు లక్షకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని నాగ్‌పూర్ తరహాలో ఒకే పిల్లర్‌పై మెట్రో రైలు నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తే ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించారని గాంధీ తెలిపారు.

నిధులు కేటాయించాలని వినతి

గచ్చిబౌలి: ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరితితో మంగళవారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణ, పలుచోట్ల సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, కొన్ని కాలనీల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

కుమ్మరులకు అండగా ఉంటా


సమావేశంలో చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరులకు అండగా ఉంటానని మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కే నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మున్సిపాలిటీ శాలివాహన కుమ్మర సంఘం వారు మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కుమ్మరులకు అందేలా చూసానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కే లక్ష్మీనారాయణ, డీ పురుషోత్తం, నాయకులు బీ. ముత్యాలు, కిరణ్‌కుమార్, కుమ్మరి సంఘం నాయకులు నర్సింగ్‌రావు, శ్రీశైలం, మల్లేశ్, మోహనకృష్ణ, శివగంగ, విజయ్, బాలయ్య, భిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి సన్మానం


నర్సింహను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ హిమబిందు తదితరులు

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (రాజేంద్రనగర్) కాంట్రాక్ట్ ఫిజిక్స్ లెక్చరర్ బొడిగె నర్సింహకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్ హిమబిందుతో పాటు సహచర అధ్యాపకులు మంగళవారం నర్సింహను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కాటేదాన్ చౌరస్తాలో బీజేపీ సభ్యత్వ నమోదు


కార్యక్రమంలో నాయకులు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ చౌరస్తాలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకుడు అడికె రాజు, బీసీ మోర్చా నాయకులు నరసింహ, అడిగే శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 100 మంది సభ్యత్వం తీసుకున్నారని నాయకులు తెలిపారు.

నేషనల్ ట్రైబల్ కమిషన్ సభ్యుడిని కలిసిన సభ్యులు


నేషనల్ ట్రైబల్ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని సేవాలాల్ విద్యార్థి దళ్ (ఎస్ఎల్‌వీగీ) సభ్యులు నేషనల్ ట్రైబల్ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌ను మంగళవారం కలిశారు. హెచ్‌సీయూలో ఎస్టీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లగా టీఎస్ఈపాస్ స్కాలర్‌షిప్‌లు అందడం లేదని, డీఏజీ ఫెల్లోషిప్‌లు పెంచాలని, హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఏదో ఒక భవనానికి సేవాలాల్ మహారాజ్‌జీ పేరు పెట్టాలని కోరారు. అలాగే యూనివర్శిటీల్లో ఎస్టీ రిజర్వేషన్లను పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని విన్నవించారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ నిచ్చినట్లు విద్యార్థులు తెలిపారు.